## క్లుప్తంగా

### పట్నం ఎస్ఐగా ఇషాక్ బాషా

ముదిగుబ్బ: మండల పరిధిలోని పట్నం పోలీస్‌స్టేషన్ ఎస్ఐగా ఇషాక్ బాషా గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇది వరకు ఇక్కడ పని చేసిన ఎస్ఐ శరత్‌చంద్ర వీఆర్‌కు వెళ్లారు. వీఆర్‌లో వున్న ఇషాక్ బాషా పట్నం ఎస్ఐగా విధుల్లోకి చేరారు.

### సంక్షేమ పాలన వైఎస్ జగన్‌తోనే సాధ్యం



లబ్ధిదారులకు పింఛన్లు అందజేస్తున్న మున్సిపల్ చైర్మన్ తుంగా ఓబులపతి

ప్రశాంతి నిలయం: ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ సంక్షేమ పాలన అందించడం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి మాత్రమే సాధ్యమని మున్సిపల్ చైర్మన్ తుంగా ఓబులపతి అన్నారు. ఇటీవల ప్రభుత్వం లబ్ధిదారులకు నూతనంగా మంజూరు చేసిన పింఛన్లను మున్సిపాలిటీ పరిధిలోని ఒకటి, రెండో వార్డుల్లో పంపిణీ చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను సీఎం జగన్ నెరవేర్చారన్నారు. రాబోవు ఎన్నికల్లో వైఎస్ జగన్‌కు పట్టం కట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ మాతంతి తిప్పన్న, సచివాలయాల సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

### రత్నాకర్‌తో మాజీ ఎంపీ కర్నల్ భేటీ



రత్నాకర్‌ను సన్మానించిన మాజీ ఎంపీ కర్నల్

కదిరి: సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జీ రత్నాకర్‌ను రెండు రోజుల క్రితం హిందూపురం మాజీ ఎంపీ కర్నల్ నిజాముద్దీన్ కలిశారు. శ్రీ సత్యసాయి జిల్లా ఏర్పాటు తర్వాత రత్నాకర్‌ను మొదటి సారిగా కలిసి జిల్లా అభివృద్ధిపై చర్చించినట్లు ఆయన తెలిపారు. తాను ఎంపీగా ఉన్న సమయంలో కదిరి–పుట్టపర్తికి కొత్త రైల్వే లైన్ ప్రతిపాదనలు పంపామన్నారు. ఇందుకోసం అప్పటి రైల్వే మంత్రి లాలూ ప్రసాద్ యాదవ్ రూ.5 కోట్ల నిధులు కూడా విడుదల చేశారని గుర్తు చేశారు. రైల్వే లైన్ ఏర్పాటుపై కేంద్ర ప్రభుత్వం దృష్టి సారించాలని కోరారు. అనంతరం జిల్లా ఎస్పీ మాధవరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు.

### రికార్డుల నిర్వహణ తప్పనిసరి



రికార్డులను పరిశీలిస్తున్న డ్వామా పీడీ రామాంజనేయులు

అమడగూరు: పండ్ల తోటలు నిర్వహణ, పనులకు సంబంధించిన రికార్డులను ఎప్పటికప్పుడు రాసుకోవాలని డ్వామా పీడీ రామాంజనేయులు పేర్కొన్నారు. గురువారం ఆయన ఓడీచెరువు మండలంలో 2021 ఏప్రిల్ నుంచి 2023 ఏప్రిల్ వరకూ ఉపాధిహామీ ద్వారా నిర్వహించిన అన్ని రకాల రిజిస్టర్లను తనిఖీ చేశారు. పలువురు సిబ్బంది సరిగా రికార్డులు రాయకపోవడంతో అసహనం వ్యక్తం చేశారు. ఇక నుంచి రికార్డులు సరిగా చూపకపోతే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఏపీడీ శ్రీనివాసులు, ఏపీఓ సోమశేఖర్‌రెడ్డి, ఉపాధిహామీ సిబ్బంది పాల్గొన్నారు.

### యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు



తంగేడుకుంటలో పొలంబడి నిర్వహిస్తున్న వ్యవసాయాధికారులు

అమడగూరు: రైతులు యాజమాన్య పద్ధతుల ద్వారా పంటలను సాగు చేయడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని ఓడీచెరువు వ్యవసాయాధికారి ఇలియాజ్ మహమ్మద్ పేర్కొన్నారు. తంగేడుకుంటకు చెందిన రైతు మూర్తి పొలంలో గురువారం పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏఓ మాట్లాడుతూ.. పంటకు చుట్టూ మేరుసాళ్ల జొన్న, సజ్జ కానీ సాగు చేయడం ద్వారా బయట నుంచి వచ్చే పురుగులను అరికట్టవచ్చన్నారు. మొదటగా భూమిని ఆరోగ్యవంతంగా ఉంచి జీవ నియంత్రణ పద్ధతుల ద్వారా సాగు చేయాలన్నారు. పంట సాగు చేసిన తర్వాత పంటకు సోకే వివిధ రకాల తెగుళ్లు, వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

# నాణ్యమైన విద్యుత్ అందించడమే లక్ష్యం

- ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి
- పోతులనాగేపల్లిలో రూ.2.50 కోట్ల వ్యయంతో నిర్మించిన విద్యుత్ సబ్‌స్టేషన్ ప్రారంభం



విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి

ధర్మవరం: వినియోగదారులు, రైతులకు నాణ్యమైన విద్యుత్ అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. గురువారం స్థానిక పోతులనాగేపల్లి జగనన్న లేఅవుట్ వద్ద రూ.2.50 కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మించిన విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ప్రారంభించారు. విద్యుత్ సబ్‌స్టేషన్‌లో నూతనంగా అమర్చిన పరికరాలను, సప్లయ్ చానల్‌ను పరిశీలించారు. ప్రజలకు అందించే సేవలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేతిరెడ్డి మాట్లాడుతూ.. పోతులనాగేపల్లి వద్ద నూతనంగా ఏర్పాటు చేస్తున్న జగనన్న కాలనీల్లో 6,700కు పైగా ఇళ్లను నిర్మించడం జరుగుతోందన్నారు. వీరందరికీ విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు తలెత్తకుండా 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌ను రూ.2.50 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేశామన్నారు. ఈ సబ్‌స్టేషన్ ద్వారా జగనన్న కాలనీలకే కాకుండా రూరల్ పరిధిలోని పోతులనాగేపల్లి, తుంపర్తి, మోటుమర్రి, సీసీకొత్తకోట తదితర ప్రాంతాల్లోని రైతాంగానికి నాణ్యమైన విద్యుత్ అందించడం జరుగుతోందన్నారు. ప్రభుత్వం రైతాంగానికి మేలు చేసేలా రైతులకు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కనెక్షన్‌కు దరఖాస్తు చేసుకున్న నెల రోజుల్లోపే మంజూరు చేయడం జరుగుతోందన్నారు. హెచ్‌వీడీఎస్ పథకం ద్వారా రైతులకు తక్కువ ధరకు ట్రాన్స్‌ఫార్మర్లను అందజేయడం జరిగిందన్నారు. జిల్లాలో రూ.150 కోట్ల దాకా ఈ పథకం ద్వారా ఖర్చు పెట్టడం జరిగిందన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో రైతుల నుంచి డబ్బులు దోచుకోవడం జరిగిందన్నారు. డిమాండ్‌కు తగ్గట్టుగా విద్యుత్ సరఫరా చేసేందుకు వీలుగా నియోజకవర్గంలో కొత్తగా గొట్లూరు, బత్తలపల్లి మండలం అప్పరాచెరువు, ముదిగుబ్బ మండలం దొరిగిల్లు ప్రాంతాల్లో 33/11కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్లు నిర్మించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. తద్వారా రైతులకు లోటోల్టేజీ సమస్యను పూర్తిగా నివారించడం జరుగుతోందన్నారు. పేదలకు సొంతింటి కలను సాకారం చేయడంతో పాటు జగనన్న లేఅవుట్‌లలో కొత్తగా ఇళ్లు నిర్మించుకున్న వారికి విద్యుత్ మీటర్‌తో పాటు బోర్డు ఇతర పరికరాలను ఉచితంగా ప్రభుత్వం అందజేయడం జరుగుతోందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ కాచర్ల లక్ష్మి, వైస్ చైర్మన్లు వేముల జయరామిరెడ్డి, షంషాద్‌బేగం, ఏపీఎస్‌పీడీసీఎల్ ఎస్ఈ సురేంద్ర, ఈఈ రమేష్, డీఈఈ కిరణ్‌కుమార్, డీఈఈ కన్‌స్ట్రక్షన్ శ్రీకాంత్‌రెడ్డి, రూరల్ ఏఈ జానకిరామయ్య, డీ1, డీ2 ఏఈలు కొండారెడ్డి, నాగభూషణ, కన్‌స్ట్రక్షన్ ఏఈ నజీరుద్దీన్, పట్టణ సచివాలయాల కన్వీనర్లు చందమూరి నారాయణరెడ్డి, మాసపల్లి సాయికుమార్, పోతులనాగేపల్లి, సీసీ కొత్తకోట సర్పంచులు మౌనిక, పల్లి విష్ణువర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

### మున్సిపాలిటీని ఆదర్శంగా నిలుపుదాం



సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి

ధర్మవరం: అభివృద్ధిలో ధర్మవరం మున్సిపాలిటీని ఆదర్శంగా నిలుపుతామని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని 22వ వార్డులో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వార్డులో ఇంటింటికీ తిరుగుతూ ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమాన్ని వివరించారు. వార్డులో విద్యుత్ స్తంభాలు శిథిలావస్థకు చేరుకున్నాయని, సిద్దయ్యగుట్ట వద్ద నీటి సరఫరాలో సమస్యలు తలెత్తుతున్నాయని పలువురు తెలిపరాఉ. ఎమ్మెల్యే స్పందిస్తూ.. వార్డులో శిథిలావస్థకు చేరుకున్న విద్యుత్ స్తంభాలను గుర్తించి వాటి స్థానంలో కొత్త వాటిని ఏర్పాటు చేయాలని విద్యుత్ అధికారులను ఆదేశించారు. అలానే సిద్దయ్యగుట్ట వద్ద నీటి సరఫరాలో అవాంతరాలు లేకుండా చర్యలు చేపట్టాలని మున్సిపల్ కమిషనర్‌కు సూచించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ధర్మవరం మున్సిపాలిటీలో రూ.12 కోట్ల వ్యయంతో 14 కిలోమీటర్ల దాకా సీసీ రోడ్లు, రూ.9.80 కోట్ల వ్యయంతో 76 కిలోమీటర్ల పొడవునా డ్రైనేజీలను నిర్మించడం జరిగిందన్నారు. 40 వార్డులకు గానూ ప్రతి వార్డులోనూ సమానంగా నిధులు వెచ్చించి అభివృద్ధి పనులు చేపట్టడం జరుగుతోందన్నారు. అర్హులైన పేదలందరికీ శాచురేషన్ పద్ధతిలో సంక్షేమ పథకాలను అందిస్తున్నట్లు వెల్లడించారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను వందశాతం అమలు చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ వేముల జయరామిరెడ్డి, షంషాద్ బేగం, కమిషనర్ బండి శేషన్న, వార్డు కౌన్సిలర్ చౌడం సుబ్బలక్ష్మి, వార్డు ఇన్‌చార్జ్ కుమారస్వామి, పట్టణ సచివాలయాల కన్వీనర్లు చందమూరి నారాయణరెడ్డి, మాసపల్లి సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

### కరాటే పోటీల్లో ప్రతిభ



పతకాలు సాధించిన విద్యార్థులు

కదిరి అర్బన్: ఇటీవల కర్నూలులో జరిగిన జాతీయ స్థాయి కరాటే పోటీల్లో మున్సిపల్ పరిధిలోని బ్లూమూన్ కళాశాల విద్యార్థిని సిరి గోల్డ్ మెడల్ సాధించి ద్వితీయ స్థానంలో నిలిచింది. అలాగే నికిత అనే మరో విద్యార్థిని కూడా గోల్డ్ మెడల్ సాధించింది. కటా విభాగంలో చందన, సిరి గోల్డ్ మెడల్, నికిత బ్రాంజ్ మెడల్ సాధించారు. కరాటేలో పతకాలు సాధించిన విద్యార్థినులను కళాశాల చైర్మన్ శివశంకర్ అభినందించారు. కార్యక్రమంలో కరాటే మాస్టర్ షెక్షావలి పాల్గొన్నారు.

### వ్యక్తి ఆత్మహత్య

ఎన్‌పీకుంట: మండల పరిధిలోని గొకనపేట గ్రామానికి చెందిన కొవ్వూరి వెంకటరమణ (38) పంటల సాగుకు చేసిన అప్పులు తీర్చలేక గురువారం పురుగుల మందు సేవించి ఆత్మహత్య చేసుకున్నట్లు బంధువులు తెలిపారు. తోట వద్ద పురుగుల మందు సేవించిన వెంకటరమణను కదిరి ఏరియా ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడికి భార్య లక్ష్మీదేవి, ఒక కుమారుడు ఉన్నారు.

### కుక్కల దాడిలో 15 గొర్రెల మృతి

తనకల్లు: మండల పరిధిలోని రెడ్డివారిపల్లిలో మస్తానప్ప అనే వ్యక్తికి చెందిన 15 గొర్రెలు గురువారం కుక్కల దాడిలో మృతి చెందాయి. వివరాలు.. మస్తానప్ప తన గొర్రెలను గొర్రెలదొడ్డిలో తోలి ఇంటికి వెళ్లాడు. కుక్కలు మందలోకి చొరబడి గొర్రెలపై దాడి చేశాయి. ఈ ఘటనలో 15 గొర్రెలు అక్కడికక్కడే మృతి చెందాయి. రూ. 2.50 లక్షలు నష్టం వాటిలినట్లు బాధితుడు వాపోయాడు.

# దేశానికే ఆదర్శంగా ఆర్బీకేలు

- ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి



రైతులకు సబ్సిడీపై ఉలవలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి

ఎన్‌పీకుంట: రైతుల సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పెద్దపీట వేశారని ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన ఎన్.పీ.కుంట–2 ఆర్బీకేను ప్రారంభించారు. తొలుత పార్టీ నాయకులు, కార్యకర్తలు గజమాలలతో ఎమ్మెల్యేకు స్వాగతం పలికారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. రైతుల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వం గ్రామ స్థాయిలోనే రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులకు సేవలు అందిస్తోందన్నారు. డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వ్యవసాయాన్ని లాభసాటిగా మారిస్తే ఆయన కుమారుడు, రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి వ్యవసాయాన్ని పండగలా మార్చారని తెలిపారు. గత టీడీపీ ప్రభుత్వం వ్యవసాయం దండగ అని రైతులను అప్పులపాలు చేసిందన్నారు. ఎంతో మంది రైతులు సాగు భారమై ఆత్మహత్యలు చేసుకున్నారని గుర్తు చేశారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదన్నారు. ప్రతి గ్రామంలో రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేయడంతో వ్యవసాయ, ఉద్యాన, ఫిషరీస్, పట్టుపరిశ్రమ శాఖ తదితర ప్రభుత్వ విభాగాల సేవలన్నీ రైతులకు అందుతున్నాయని వెల్లడించారు. సాగులో మెలకువలు, నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులను నిర్దిష్టమైన ధరలకే ఆర్బీకేల ద్వారా అందజేయడం జరుగుతుందన్నారు. రైతులు పండించిన ప్రతి పంటకు ఈనెల 15 లోపు ఈ–క్రాప్ నమోదు తప్పనిసరిగా చేయించాలని రైతులకు సూచించారు. ఆర్బీకే నిర్మాణ పనులను సకాలంలో పూర్తి చేసిన నిర్మాణ సహాయకులు మహబూబ్‌బాషాను సన్మానించారు. అనంతరం 80 శాతం సబ్సిడీపై రైతులకు ఉలవలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ ఈటె రాము, సర్పంచ్ అంజినమ్మ, ఎంపీటీసీ సభ్యుడు కొత్త రంగారెడ్డి, కో–ఆప్షన్ సభ్యుడు సుబహాన్, మండల అగ్రీ అడ్వైజరీ బోర్డ్ చైర్మన్ ఆదినారాయణ రెడ్డి, ఎంపీడీఓ ఆదినారాయణ, తహసీల్దార్ నరేంద్రకుమార్, ఏఓ లోకేశ్వర్‌రెడ్డి, సర్పంచ్ విష్ణుమూర్తి, ఉప సర్పంచులు ఈశ్వర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు రామచంద్రా రెడ్డి, మైనారిటీ నాయకులు షామీర్‌బాషా, అల్లాబక్షు, బీసీ సెల్ కన్వీనర్ ఆదెప్ప నాయుడు, మాజీ మార్కెట్‌యార్డు చైర్మన్ రాఘవయ్య, వాటర్‌షెడ్ చైర్మన్లు బయారెడ్డి, ఓబుళరెడ్డి, గ్రామ కన్వీనర్ వెంకటేశ్వర్లు, నాయకులు శ్రీరాములు, గోవింద్ నాయక్, తిరుమల నాయుడు, భాస్కర్‌రెడ్డి, విశ్రాంత వీఆర్‌ఓ ఓబుళరెడ్డి, భాస్కర్, సుహేల్‌కాన్ పాల్గొన్నారు.

# అలరించిన చిన్ని కృష్ణులు



సత్యసాయి మహాసమాధి వద్ద విద్యార్థుల నృత్య ప్రదర్శన

ప్రశాంతి నిలయం/పుట్టపర్తి టౌన్/కదిరి టౌన్/ధర్మవరం అర్బన్/కొత్తచెరువు/చెన్నేకొత్తపల్లి/ముదిగుబ్బ/నల్లచెరువు/ధర్మవరం రూరల్: ప్రశాంతి నిలయంలో సాయికుల్వంత్ సభా మందిరంలో సత్యసాయి మహాసమాధి వద్ద కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. గురువారం గోకులం నుంచి ప్రత్యేకంగా అలంకరించిన గోవులను ఊరేగింపుగా తీసుకొచ్చారు. అక్కడ పండితుల వేదమంత్రోచ్చారణల నడుమ భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. గోపూజలో భాగంగా గోవులను పాలు పండ్లు తినిపించారు. విద్యార్థులు శ్రీ కృష్ణుడు వేషధారణలో సందడి చేశారు. సత్యసాయి మహాసమాధి చెంత సత్యసాయిని శ్రీ కృష్ణుడిని కొనియాడుతూ సంగీత కచేరి నిర్వహించారు. సాయంత్రం వేడుకలలో భాగంగా సంగీత కచేరి నిర్వహించారు. కోవెలగుట్టపల్లి గ్రామంలో ఉట్టి కొట్టే కార్యక్రమం నిర్వహించారు. యువకులు పోటాపోటీగా ఉట్టి కొట్టడానికి ఎగబడ్డారు. సంస్కృతీ విద్యాసంస్థల్లో కృష్ణుడి వేషధారణలో విద్యార్థులు సందడి చేశారు. కళాశాల చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ సంస్కృతీ సంప్రదాయాలను గౌరవించాలన్నారు. ముదిగుబ్బ, నల్లచెరువు, ధర్మవరం, చెన్నేకొత్తపల్లి, కొత్తచెరువు, కదిరిలో యాదవ కులస్తులు శ్రీకృష్ణుడి విగ్రహాలను ఊరేగించారు. ధర్మవరంలో చిన్నారుల చేత ఉట్టిని కొట్టించి వేడుకలను జరుపుకున్నారు.



ధర్మవరం అర్బన్: యాదవ వీధిలో..



గోవులకు పండ్లు తినిపిస్తున్న ఆర్‌జే రత్నాకర్



సంస్కృతి ఇంజినీరింగ్ కళాశాలలో..



ముదిగుబ్బ: వెండి రథంపై ఊరేగుతున్న శ్రీకృష్ణుడు



కదిరి టౌన్: పల్లకీని లాగుతున్న భక్తులు

## సంక్షిప్త సమాచారం

### రచ్చబండ నిర్మాణానికి విరాళం

కదిరి అర్బన్: మరువతండాలో రచ్చబండ నిర్మాణానికి వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మణికంఠనాయక్ గురువారం రూ.15 వేల విరాళాన్ని కుమ్మరవాండ్లపల్లి సచివాలయంలో గ్రామస్తులకు అందజేశారు. కార్యక్రమంలో పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

### గ్రంథాలయం తనిఖీ

నల్లచెరువు: మండల కేంద్రంలోని గ్రంథాలయాన్ని గురువారం గ్రంథాలయ సంస్థ జిల్లా కార్యదర్శి పి.రమ తనిఖీ చేశారు. పలు రికార్డులను పరిశీలించారు. గ్రంథాలయ నిర్వహణపై గ్రంథాలయ అధికారి ప్రసాద్‌నాయక్‌కు సూచనలిచ్చారు.

### కళ్లద్దాల పంపిణీ

పుట్టపర్తి: బుక్కపట్నం మండలం సిద్దరాంపురంలో గురువారం వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా ఆపరేషన్లు చేయించుకున్న 170 మందికి కళ్లద్దాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ రమణయ్య, హెల్త్ సూపర్‌వైజర్ రామమోహన్ చౌదరి పాల్గొన్నారు.

### నేడు తాగునీటి సరఫరా బంద్

ధర్మవరం అర్బన్: ధర్మవరం పట్టణంలో శుక్రవారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 7 గంటల వరకూ తాగునీటి సరఫరా బంద్ చేస్తున్నామని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తంబాపురం వాటర్ వర్క్స్ వద్ద పైపులైన్ లీకేజీ కావడంతో భారీగా నీరు వృథాగా పోతోందన్నారు. పైపులైనుకు వెల్డింగ్ చేయాల్సి ఉండటంతో తాత్కాలికంగా నీటి సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

### నేడు మండల స్థాయి క్రీడా పోటీలు

కదిరి అర్బన్: స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో శుక్రవారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండల స్థాయి క్రీడా పోటీలు నిర్వహిస్తామని హెచ్‌ఎం వెంకటాచలపతి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు విద్యార్థులను మైదానానికి తీసుకుని రావాలని ఆయా పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులకు సూచించారు.

### పౌష్టికాహారం అందించాలి

గాండ్లపెంట: మండల పరిధిలోని కటారుపల్లి గ్రామ సచివాలయం, అంగన్‌వాడీ–1, 2 కేంద్రాలను ఎంపీడీఓ రామానాయక్ గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సచివాలయంలోని సిబ్బంది హాజరు పట్టికను పరిశీలించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. వైఎస్సార్ చేయూత, జగనన్న పాలవెల్లువ సర్వేపై ఆరా తీశారు. త్వరితగతిన సర్వే పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం అంగన్‌వాడీ–1, 2 కేంద్రాలను సందర్శించారు. గర్భిణులు, బాలింతలకు ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని క్రమం తప్పకుండా అందించాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలోని గర్భిణులు, బాలింతలు వివరాలను అడిగి తెలుసుకున్నారు.

### ఉపాధ్యాయులకు సన్మానం

కదిరి అర్బన్: మండల పరిధిలోని మొటుకుపల్లి ఆర్డీటీ రీజనల్ కార్యాలయంలో గురువారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆర్డీటీ పాఠశాల టీచర్లను సన్మానించారు. ఈ సందర్భంగా సర్వేపల్లి రాధాకృష్ణన్, ఆర్డీటీ వ్యవస్థాపకుడు ఫాదర్ ఫెర్రర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఉపాధ్యాయ వృత్తి విశిష్టతను పలువురు వక్తలు తెలియజేశారు. కార్యక్రమంలో రీజనల్ డైరెక్టర్ శాంతమ్మతో పాటు ఆర్డీటీ కమ్యూనిటీ బేసిక్ టీచర్స్ పాల్గొన్నారు.

### చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ధర్మవరం రూరల్: ఆటో బోల్తా పడిన సంఘటనలో తీవ్రంగా గాయపడిన మహమ్మద్(62) అనే వ్యక్తి చికిత్స పొందుతు బుధవారం రాత్రి మృతి చెందాడు. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు ధర్మవరం పట్టణంలోని సిద్దయ్యగుట్టకు చెందిన మహమ్మద్ ఈ నెల 5వ తేదీన తన ఆటోలో ముదిగుబ్బ నుంచి తన కుమారుడు సయ్యద్ జామీర్ అహమ్మద్‌ను ఎక్కించుకుని ధర్మవరం మండలం తుమ్మల మీదుగా వస్తున్నాడు. జోరు వానలో రహదారి సరిగా కనిపించక బస్టాప్ సమీపంలో రోడ్డు పక్కన ఉన్న గుంతలోకి ఆటో దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో మహమ్మద్ తీవ్రంగా గాయపడ్డాడు. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం అనంతపురంలోని ఓ ప్రవేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు.

### భూ సమస్యల పరిష్కారమే లక్ష్యం

బత్తలపల్లి: భూ వివాదాలను శాశ్వతంగా పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు–భూరక్ష పథకానికి శ్రీకారం చుట్టిందని వైస్ ఎంపీపీ గజ్జలవెంగళరెడ్డి, సర్పంచులు చల్లా కరుణాకర్‌నాయుడు, మాచిరెడ్డి పద్మావతి అన్నారు. గురువారం మండలంలోని దంపెట్ల సచివాలయంలో రీ సర్వే నిర్వహణపై గ్రామ సభ నిర్వహించారు. కార్యక్రమంలో కార్యదర్శి భారతి, వీఆర్‌ఓ నరసింహులు, సర్వేయర్ రవి, నాయకులు చెన్నారెడ్డి, కృష్ణమూర్తి, ఓబులయ్య, వెంకట నారాయణ పాల్గొన్నారు.

### రీ సర్వేతో భూ యజమానులకు భద్రత



సంగాలలో రీ సర్వే వివరాలు తెలుసుకుంటున్న తహసీల్దార్ యుగేశ్వరి దేవి

బత్తలపల్లి: వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు–భూరక్ష పథకం ద్వారా చేపడుతున్న రీ సర్వేతో యజమానులకు ఆస్తి హక్కుపైన మరింత భద్రత ఉంటుందని తహసీల్దార్ యుగేశ్వరిదేవి అన్నారు. గురువారం డి.చెర్లోపల్లి, సంగాల రెవెన్యూ గ్రామాల్లో జరుగుతున్న భూ సర్వేను ఆకస్మికంగా తనిఖీ చేశారు. 1923లో ఏపీ సర్వే, బౌండరీల చట్టం తీసుకొచ్చారన్నారు. ఇప్పుడు వందేళ్ల తర్వాత రీ సర్వేకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. గతంలో ఏదైనా ఆస్తి విక్రయించాలన్నా, కొనుగోలు చేయాలన్నా పలు సందేహాలతో రెవెన్యూ, సర్వే, రిజిస్ట్రేషన్ కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి ఉండేదన్నారు. భూమి, రెవెన్యూ రికార్డులను అనుసంధానం చేయడానికి సమగ్ర భూసర్వే కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టిందన్నారు. సర్వే కోసం లబ్ధిదారులు అర్జీ ఇవ్వకపోయినా సర్వే నిర్వహణ, యాజమాన్యపు హక్కు నిర్ధారణ, రికార్డుల్లో నమోదు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వీఆర్‌ఓలు నాగేంద్ర, విష్ణు, విఆర్‌ఓలు, రైతులు, వైఎస్సార్‌సీపీ నాయకులు గుజ్జల మునలయ్య తదితరులు పాల్గొన్నారు.

# పేదల పక్షపాతి సీఎం జగన్



పింఛన్లు పంపిణీ చేస్తున్న తోపుదుర్తి చంద్రశేఖర్‌రెడ్డి

కనగానపల్లి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల పక్షపాతిగా పని చేస్తూ మహానేత వైఎస్ రాజశేఖర రెడ్డి ఆశయాలను కొనసాగిస్తున్నారని వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత తోపుదుర్తి చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. మండల కేంద్రంలో గురువారం నిర్వహించిన సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం కులమత, రాజకీయాలకతీతంగా సంక్షేమ పథకాలను అర్హులందరికీ అందిస్తోందన్నారు.

**సూడో నక్సలిజాన్ని ప్రోత్సహించిన ఎల్లో మీడియా:** గతంలో ఉన్న తరిమెల నాగిరెడ్డి వంటి అసలైన విప్లవకారులను పక్కన పెట్టిన ఎల్లో మీడియా సూడో నక్సలిజాన్ని నడిపిన పరిటాలరవి లాంటి వారిని ప్రోత్సహించారని తోపుదుర్తి చందు విమర్శించారు. దీన్ని అసరా చేసుకొని రాజకీయాల్లో వచ్చిన పరిటాల కుటుంబం పేదలకు చేసిందేమీలేదన్నారు. 25 ఏళ్ల పాటు రాజకీయ పదవులు అనుభవిస్తూ రూ.కోట్లకు పడగలెత్తారన్నారు. అయితే ఇప్పుడు తమపైన, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపైన అనవసరమైన ఆరోపణలు చేస్తున్నారన్నారు. .కార్యక్రమంలో ఎంపీపీ కుంపటి భాగ్యమ్మ, జెడ్పీటీసీ సభ్యుడు మారుతీప్రసాద్, అగ్రీబోర్డు చైర్మన్ వెంకటరాముడు, సొసైటీ అధ్యక్షుడు భాస్కర్, డైరెక్టర్ ప్రభాకర్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అమరనాథరెడ్డి, యూత్ కన్వీనర్ అశోక్, నాయకులు నాగముని, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

# క్రీడలతో ఉజ్వల భవిత

ధర్మవరం అర్బన్: చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తే మంచి గుర్తింపు లభిస్తుందని ఎంఈఓలు రాజేశ్వరి, గోపాల్‌నాయక్, హెచ్‌ఎం శైలజ తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో గురువారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియాలో ఆధ్వర్యంలో మండల స్థాయి క్రీడా పోటీలు నిర్వహించారు. అండర్–14, అండర్–17 విభాగంలో వాలీబాల్, బాల్‌బాడ్మింటన్, టెన్నికాయిట్, ఖోఖో, కబడ్డీ, యోగ, బ్యాడ్మింటన్ పోటీల్లో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు పోటీపడ్డారు. మండల స్థాయిలో ప్రతిభ చూపిన క్రీడాకారులను నియోజకవర్గస్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని తెలిపారు. శుక్రవారం అథ్లెటిక్స్ పోటీలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వేణుగోపాలాచార్యులు, పీడీలు నాగేంద్ర, రఘునాథ్‌రావు, లక్ష్మీనారాయణ, పద్మ, అశ్విని, జగదీష్, మల్లేష్, పాఠశాలల ఉపాధ్యాయులు, పీడీలు పాల్గొన్నారు.

పుట్టపర్తి: బుక్కపట్నం బాలుర ఉన్నత పాఠశాలలో గురువారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో మండల స్థాయి క్రీడా పోటీలు నిర్వహించినట్లు పీడీ నాగరాజు తెలిపారు. వాలీబాల్, బాల్ బ్యాడ్మింటన్, కబడ్డీ షటిల్‌లో అండర్–14, అండర్–17 విభాగాల్లో నియోజకవర్గ స్థాయి పోటీలకు విద్యార్థులను ఎంపిక చేశామన్నారు. పీడీ నాగరాజును బయారెడ్డి, చెన్నకృష్ణారెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ రిటైర్డ్ ఉద్యోగి కృష్ణారెడ్డి, హెచ్‌ఎం జగదీశ్వర్ సన్మానించారు. అలాగే పాఠశాలకు క్రీడా సామగ్రిని పెనుజూరి కృష్ణ అందజేశారు.